# పటాన్‌చెరులో 69.61శాతం

- నియోజకవర్గంలో 3,97,247 లక్షల ఓట్లు
- 2,76,510 లక్షల ఓట్లు పోలింగ్
- అత్యధిక పోలింగ్ ఈదుల నాగులపల్లిలో 93.55శాతం
- బీహెచ్ఈఎల్‌లో అత్యల్పం 43.79గా నమోదు



పటాన్‌చెరులో ఓటు వేసేందుకు లైన్లో నిలిచిన ఓటర్లు (ఫైల్)

పటాన్‌చెరు, డిసెంబర్ 1: పటాన్‌చెరు నియోజకవర్గంలో 69.61శాతం ఓటింగ్ జరిగింది. గురువారం శాసనసభకు జరిగిన ఎన్నికల్లో పటాన్‌చెరు నియోజకవర్గంలో పలుచోట్ల భారీగా, కొన్నిచోట్ల అత్యల్పంగా పోలింగ్ నమోదయింది. మొత్తం 3,97,237లక్షల ఓట్లు నియోజకవర్గంలో ఉన్నాయి. వీటిలో 2,76,510లక్షల ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయి. వీటిలో మహిళలు 1, 34,220 ఓట్లు వేశారు. పురుషులు 1లక్ష 42వేల 254 ఓట్లు వినియోగించుకున్నారు. 69.61శాతం ఓట్లు పోల్ కావడంతో అన్ని రాజకీయ పార్టీలు తమకు కలిగే లాభ నష్టాలపై దృష్టి సారించాయి. అత్యధికంగా రామచంద్రాపురం మండలం ఈదులనాగులపల్లి పోలింగ్ బూత్‌లో 93.55శాతం ఓట్లు పోల్ అయ్యాయి. అత్యల్పంగా ఆర్సీపురం పరిధిలోని బీహెచ్ఈఎల్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లోని బూత్ నంబ ర్ 353లో 43.79శాతం మాత్రమే ఓట్లు పడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో భారీగా ఓట్లు పోల్ కావడం విశేషం. పట్టణ, మున్సిపల్ ప్రాంతాల్లో అత్యల్పంగా ఓటింగ్ జరిగింది. పట్టణాల్లో సెటిలర్లు అత్యధికంగా ఉండటంతో వారు ఆసక్తిగా ఓట్లు వేయలేదని తెలుస్తున్నది. ఉదయం, సాయంత్రం సమయంలో ఓటర్లు తమ ఓటు హక్కును అధికంగా వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులు ఎలాంటి అవంతరాలు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఓటర్లు చైతన్యంతో ఓట్లు వేస్తే మరింత పోలింగ్ శాతం పెరిగేదని భావిస్తున్నారు.

**జోరుగా ఊహాగానాలు**

69.61శాతం ఓటింగ్ పోల్ అవడంతో రాజకీయ నేతలు వాటిలో తమకు పోల్ అయిన పర్సంటేజ్‌లను చర్చించుకుంటున్నారు. ప్రధాన పార్టీలతో పాటు మరికొన్ని పార్టీలు ఎన్నికల్లో ఉండటంతో రాజకీయం ఆసక్తికరంగా ఉంది. వీరికి ఇంతశాతం పోల్ అయ్యిందంటే కాదు ఇంత అంటూ బెట్టింగ్‌లకు సైతం దిగుతున్నారు. గెలుపు ఓటములను ప్రభావితం చేసే అంశాలను మాట్లాడుతున్నారు. అన్ని రాజకీయ నాయకుల శిబిరాల్లో ఉత్కంఠ ఉంది.

## ఎమ్మెల్యే విజయంసాధించాలని పాదయాత్ర

గుమ్మడిదల, డిసెంబర్ 1 : పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని బీఆర్ఎస్ కార్యకర్త, ఎమ్మెల్యే అభిమాని పాదయాత్రగా ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వరకు బయలు దేరాడు. శుక్రవారం మండలంలోని నల్లవల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నల్లవల్లి శివకుమార్ గులాబీజెండాను పట్టుకుని పాదయాత్రగా మెదక్‌జిల్లా కొల్చారం మండలంలో కొలువు తీరిన ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. ఈ అభిమానికి మంభాపూర్ గ్రామ సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు అభినందనలు తెలిపారు.



గుమ్మడిదల : నల్లవల్లి నుంచి ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న నల్లవల్లి శివకుమార్

## 'గూడెం'ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, డిసెంబర్ 1: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని గుమ్మడిదల మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో కలిశారు. పటాన్‌చెరు గడ్డపై మరోమారు గులాబీ జెండాను ఎగురవేయనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. మండలంలో నెల రోజులకు పైగా బాగా కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మంజులవెంకటేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కొత్తపల్లిప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజశేఖర్, వాసవిదామోదర్‌రెడ్డి, కంజర్ల శ్రీనివాస్, మమతావేణు, చిమ్ముల నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్‌హుస్సేన్, నాయకులు కరుణాకర్‌గౌడ్, మొగులయ్య, ఇజాజ్‌పాషా నాయకులు కలిశారు.



పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కలిసిన గుమ్మడిదల మండల బీఆర్ఎస్ నాయకులు

## ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

బొల్లారం, డిసెంబర్ 1: వరల్డ్ ఎయిడ్స్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బొల్లారం మున్సిపాలిటీకి చెందిన డిజైర్ సొసైటీలోని వ్యాధిగ్రస్త చిన్నారులతో నగరంలోని శిల్పారామం నుంచి బొటానికల్ గార్డెన్ వరకు అవగాహన ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూఎస్ కాన్సలేట్ జెన్నిఫర్ లార్సన్, సినీ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, యాంకర్ జెమినీ సురేశ్, డాక్టర్ మంజుల హాజరయ్యారు. అనంతరం బొటానికల్ గార్డెన్లో జరిగిన సమావేశంలో ఆర్పీ పట్నాయక్, యుఎస్ కౌన్సిలేట్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధి అంటుకునే వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అన్నారు. సురక్షితం కాని లైంగిక సంపర్కం వలన వచ్చే ఎయిడ్స్ వ్యాధిని ద్వేషించాలి కానీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులని కాదని కోరారు. లైంగిక విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఎయిడ్స్ వ్యాధిని తరిమికొ ట్టే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు హెచ్ఐవి ఎయిడ్స్‌కి సంబంధించిన క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిజైర్ సొసైటీ ఫౌండర్ రవిబా బు, నిర్వాహకులు కిరణ్, సొసైటీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న డిజైర్ సొసైటీ సభ్యులు



కలెక్టర్ రాజర్షి షాను శాలువాతో సత్కరించిన టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

## కలెక్టర్ రాజర్షి షాకు సత్కారం

మెదక్ అర్బన్, డిసెంబర్1: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా కృషి చేసి పోలింగ్ శాతం నమోదులో మెదక్‌ను రాష్ట్రంలోనే ద్వితీయస్థానంలో నిలిపారని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. శుక్రవారం టీఎన్జీవో అధ్యక్షుడు ఆధ్వర్యంలో తన బృందంతో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షి షాను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమిష్టి కృషి వల్లే ఎన్నికలను ప్రశాంతంగా ముగిం చామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనురాధ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ నియంత్రణలో యువతే కీలకం

**అవగాహన సదస్సులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్**




సదస్సులో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 1: సురక్షితం కాని లైంగిక సంబంధాలతో హెచ్ఐవీ సంక్రమిస్తుందని, ఈ వైరస్ రోగ నిరోధక వ్యవస్థపై దాడి చేసి దాని నిరోధకతను తగ్గిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ అన్నారు. 'ప్రపంచ ఎయిడ్స్ (హెచ్ఐవీ) డే' పురస్కరించుకొని శుక్రవారం వృక్షశాస్త్రం, జంతు శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు హెచ్ఐవీ రావడానికి గల కారణాలు, నివారణ చర్యల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణలో యువత పాత్రే కీలకమని వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ వ్యాఖ్యాన పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రవీణ్, ధనశ్రీ, దినకర్, విశ్వనాథ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి దుర్మరణం



నక్కని నవీన్ (ఫైల్)

రామాయంపేట, డిసెంబర్ 1: ట్రాక్టర్ అదుపు తప్పి ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన రామాయంపేట మండలం డి.ధర్మారంలో గురువారం రాత్రి జరిగింది. రామాయంపేట పోలీసుల కథనం ప్రకారం.. డి.ధర్మారం గ్రామానికి చెందిన నక్కని నవీన్(27) తన స్వగ్రామంలో రాత్రి ట్రాక్టర్‌పై వరిధాన్యం తెస్తుండగా డ్రైవర్ పక్కనే కూర్చున్న నవీన్ అదుపుతప్పి ట్రాక్టర్‌పై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ మృతుడిపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఎస్సై రంజిత్ తెలిపారు.



అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న చైర్మన్ దంపతులు

## వైభవంగా అమ్మవారికి అభిషేకాలు

రామాయంపేట, డిసెంబర్1: పట్టణంలోని మహంకాళి మాత ఆలయంలో అమ్మవారికి వైభవంగా అభిషేకాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారి సన్నిధికి భక్తులు ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు పాండురంగాచారి-వరలక్ష్మిలతో పాటు భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి కార్తికమాస ఉత్సవాల్లో భాగంగా అభిషేకాలను నిర్వహించి మంగళహారతులు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చైర్మన్ దంపతులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నాగరాజుచారి, సిబ్బంది శ్యాంరాజు, యాదగిరి, సత్యం, నరేశ్, లక్ష్మి ఉన్నారు.

## ఒకేషనల్ విద్యార్థులకు ఆన్‌జాబ్ శిక్షణ

రామాయంపేట, డిసెంబర్ 1: ఆన్‌జాబ్ శిక్షణను ఒకేషనల్ విద్యార్థులు శ్రద్ధతో నేర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్, కళాశాల ఆధ్యాపకుడు బాలప్రకాశ్ సూచించారు. శుక్రవారం రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఒకేషనల్ శిక్షణపై 'ఆన్‌జాబ్ శిక్షణ'ను చేపట్టారు. పట్టణంలోని విద్యుత్ స్తంభం వద్ద, వైండింగ్ వర్క్సపై విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థులతో పనులు చేయించారు. విద్యార్థులు తమ శిక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తే మంచి ఫలితాలు వస్తాయని బాలప్రకాశ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆన్‌జాబ్ శిక్షణపై ఒకేషనల్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌ను ఇస్తున్నాయని అందుకోసం ఒకేషనల్‌లో ప్రతిభను కనబరిస్తే జీవితంలో స్థిరపడతారని సూచించారు.

**ప్రకటన**

హెచ్చరించునది ఏమనగా నా క్లయింటు శ్రీమతి గొల్లతుల్జమ్మ W/o. Late నర్సింలు నివాసం: దేవరంపల్లి గ్రామం, ఝురాసంఘం మండలం, సంగారెడ్డి జిల్లా అదే గ్రామంలో గల సర్వే నం. 6/ఆ, Ext Ac. 0-19 Gts, సర్వే నం. 17/ఆ Ext Ac. 3-04 Gts; సర్వే నం. 85/ఆ1; Ext Ac. 0-15 Gts మరియు సర్వే నం. 95/ఋ Ext Ac. 1-14 Gts; మొత్తం సర్వే నంబర్లలో ఎ. 5.12 గుం. భూముల మొత్తానికి వాస్తవ యజమాని, హక్కుదారు అయివుండి దానికై గౌరవనీయ జూనియర్ సివిల్ జడ్జి, జహీరాబాద్ నందు O.S.No. 419/2021 ద్వారా ఇట్టి భూములను అక్రమముగా తన పేరున రాయించుకున్న శ్రీమతి గొల్ల గిరిజమ్మ, ఆమె ద్వారా, విషయము తెలిసి కూడా కొంత భూమి తనపేర చేయించుకున్న అలిగి నాథనాయిల్ అనువారలపై దావా వేసివున్నారు. ఇది పెండింగ్‌లో వుండగా వి. అశోక్ కుమార్ మరియు జె. లతాపరిమళ అనువారు కూడా వారి ద్వారా కొంతభూమి రిజిష్టర్ పొందినారు. ఇట్టి చెల్లనేరవు. తగుచర్యకు బాధ్యులవుదురు.
పై వ్యక్తులెవరితో పై భూముల పట్ల ఎట్టి లావాదేవీలు జరుపరాదని ఇందుమూలమున ప్రజలను హెచ్చరిస్తున్నాము. లేనట్లయితే వాటి ద్వారా కల్గునష్టములకు వ్యవహరించినవారే బాధ్యులవుదురు.

సం/- పి. జైపాల్ రెడ్డి, అడ్వకేట్
నం. 5-2-61/3/A, జలాల్ బాగ్
సంగారెడ్డి జిల్లా, తెలంగాణ (ఇండియా)-502001
సెల్: 9440003620, 9182862662